**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**విజయవాడ**

**తేదీ : అక్టోబరు 24, 2016**

**శ్రీయుత నారా చంద్రబాబునాయుడు గారికి**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
విజయవాడ.

**ప్రచురణార్థం:** ఈరోజు సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాను. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

ఆర్యా!

**విషయం : కృష్ణా జలాల వినియోగంపై బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తాజాగా ఇచ్చిన తీర్పుపై అప్పీలు, ఇతర నష్టనివారణ చర్యల కోసం అఖిలపక్ష సమావేశం జరపాలని కోరుతూ ...**

కృష్ణా జలాల పంపిణీని రెండు తెలుగు రాష్ట్రాలకు పరిమితం చేస్తూ అక్టోబరు 19న జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఇచ్చిన తీర్పు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలను తీవ్రంగా దెబ్బ తీస్తుంది. ఇదే ట్రిబ్యునల్ 2013 నవంబరు 29న ఇచ్చిన తీర్పు ఉమ్మడి రాష్ట్ర ప్రయోజనాలను తీవ్రంగా నష్టపరిచిందని అన్ని పార్టీలతోపాటు మీరు కూడా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేస్తున్నాము.

ట్రిబ్యునల్ తాజా తీర్పు సహజ న్యాయసూత్రాలకు, నదీ జలాల పంపిణీ నియమాలకు భంగకరంగా ఉంది. కేటాయించిన నీటిని వినియోగించుకోవడానికి ప్రాజెక్టులవారీగా ఆపరేషనల్ ప్రోటోకాల్ నది పొడవునా గల అన్ని ప్రాజెక్టులకూ నిర్ణయించడం అవసరం. అందుకు భిన్నంగా ట్రిబ్యునల్ కేవలం ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలోని ప్రాజెక్టులకు మాత్రమే ఆపరేషనల్ ప్రోటోకాల్స్ నిర్ణయిస్తామని చెప్పడం సముచితం కాదు. ఎగువ రాష్ట్రాలు తమ ప్రాజెక్టుల్లో నీటిని నిలిపేస్తే దిగువన ఎద్దడి ఏర్పడడం అనివార్యం. అప్పుడు కేవలం దిగువ రాష్ట్రాల్లోనే ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌ను అమలు చేయాలనడం అర్థరహితం. ట్రిబ్యునల్ తీర్పులో ఉటంకించిన ఏపి పునర్వ్యవస్థీకరణ చట్టం సెక్షన్ 89లో “నీటి ఎద్దడి ఏర్పడిన సందర్భాలలో ప్రాజెక్టులవారీగా నీటి విడుదలకు ఆపరేషనల్ ప్రోటోకాల్స్‌ను నిర్ణయించాలి” అని మాత్రమే ఉంది తప్ప రెండా లేక నాలుగు రాష్ట్రాలా అన్నది లేదు. ఆపరేషనల్ ప్రోటోకాల్స్ నది మొత్తానికి నిర్ణయిస్తేనే అమలు చేయడం ఆచరణ సాధ్యమవుతుందన్న విషయం అందరికీ తెలుసు.

ఇదే ట్రిబ్యునల్ తీర్పుపై సుప్రీం కోర్టులో నడుస్తున్న వ్యాజ్యానికి సంబంధించి కేంద్రప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్‌లో కృష్ణా నదీ జలాల పంపిణీ వివాదం రెండు తెలుగు రాష్ట్రాలకు పరిమితంగా ఉండాలని పేర్కొనడం మన రాష్ట్ర ప్రయోజనాలను మరింత దెబ్బ తీస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఆ వైఖరి తీసుకోవడం వెనుక మహారాష్ట్ర, కర్నాటకల్లో త్వరలో జరుగనున్న ఎన్నికల్లో బిజెపి ప్రయోజనాలను కాపాడుకోవాలన్న లక్ష్యం ఉందని మీడియా కథనాలు కోకొల్లలుగా వచ్చాయి.

కృష్ణా నదీ జలాల విషయంలో రాష్ట్రానికి జరిగిన అన్యాయాన్ని గురించి చర్చించి నష్ట నివారణకు చర్యలు చేపట్టడం ప్రభుత్వ బాధ్యత. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ తాజా తీర్పు కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాక తెలంగాణకూ నష్టదాయకమే కనుక ఉభయ రాష్ట్రాలు సమన్వయ వైఖరి చేపట్టడం సబబుగా ఉంటుంది. తీర్పుపై అప్పీలు చేయడమే కాక తన వైఖరిని సరిచేసుకోవాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడమూ అవసరం. ఈ స్థితిలో రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలు కాపాడడానికి ఏకోన్ముఖంగా కృషి చేయడం నేటి కర్తవ్యం. అందరి మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని కోరుతున్నాము.

**అభివందనములతో...**

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి